తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 27 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 359 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుపై కీలక చర్చ

## రక్షణ శాఖ మంత్రిని కలిసిన కిషన్ రెడ్డి
## ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధిపై చర్చ

**న్యూఢిల్లీ, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణంపై కేంద్ర స్థాయిలో కీలక చర్చ జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టుపై సమీక్షించారు.

మిగతా 2లో..



# జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

## నర్సింగాపూర్‌లో ఆరు ఎకరాల భూమి కేటాయింపు
## విద్యా అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం
## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలన

**జగిత్యాల, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):**

జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయానికి సంబంధించిన స్థలాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,

మిగతా 2లో..



# ఓఆర్ఆర్‌పై ఎయిర్ ఇండియా బస్సుకు మంటలు

## పెద్ద అంబర్‌పేట సమీపంలో ఘటన
## చాకచక్యంగా ప్రయాణికులను దింపిన డ్రైవర్
## భారీ ట్రాఫిక్‌కు దారితీసిన ప్రమాదం

**హైదరాబాద్, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై మంగళవారం ఘోర ప్రమాదం తప్పింది. పెద్ద అంబర్‌పేట సమీపంలో ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన బస్సులో అకస్మాత్తుగా భారీగా మంటలు చెలరేగాయి.

మిగతా 2లో..





## గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా

# మొదటి తేదీనే వేతనాలు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మే26(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా మొదటి తేదీననే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి వేతనాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా వేతనాలు అందాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం ప్రభుత్వం ప్రతినెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా మంజూరు చేస్తుందని తెలిపారు.

బయటి సేవలు, ఒప్పంద ఉద్యోగులు అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీననే వేతనాలు అందేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది వేతనాలు ఒక్కరోజు ఆలస్యమైనా సహించబోమని హెచ్చరించారు.

గ్రామ పంచాయతీల స్వంత ఆదాయ స్వతంత్రతను ప్రభావితం చేస్తూ గత ప్రభుత్వం తొలగించిన నిబంధనను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70(3)కు ప్రతిపాదిత మార్పు ప్రకారం గ్రామ పంచాయతీల స్వంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానా ఖాతాలో కాకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ విధానంలో కూడా మార్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం తపాలా శాఖ ద్వారా అందజేస్తున్న విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. పెన్షన్లు అర్హులకే అందేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆధారంగా పెన్షన్లను క్రమబద్ధీకరించాలని సూచించారు. కొత్త పెన్షన్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సమీక్ష
- "ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాలపై చర్చ
- ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా అమలుపై దృష్టి

**హైదరాబాద్, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాలపై మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణతో పాటు "ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" పథకం

మిగతా 2లో..



# భగీరథ్‌కు మూడు రోజుల కస్టడీ

## పోక్సో కేసులో మల్కాజ్‌గిరి కోర్టు ఆదేశాలు



2లో



# అంతర్జాతీయ సెయిలింగ్‌లో రమేజా భాను ప్రతిభ

- మంత్రి సీతక్క అభినందనలు
- మొరాకో పోటీలకు సిద్ధమైన యువ సైలర్
- తెలంగాణకు గర్వకారణమన్న మంత్రి

**హైదరాబాద్, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):**

అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్న యువ సైలర్ రమేజా భానును రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సచివాలయంలో అభినందించారు. పలు అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న రమేజా భాను విజయాలను మంత్రి

మిగతా 2లో..



# భూ బాధితులకు న్యాయం చేయాలని గవర్నర్‌కు వినతి

## గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన కవిత
## వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి బాధితుల సమస్యల వివరణ
## ప్రభుత్వం స్పందించకపోతే మళ్లీ ఉద్యమం హెచ్చరిక

**హైదరాబాద్, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం లోక్ భవన్‌లో కలిసి భూ నిర్వాసితుల సమస్యలను వివరించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుపై కీలక చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ఈ భేటీలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కూడా పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయ నిర్మాణం, అభివృద్ధి, అమలు కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, కేంద్ర అనుమతులు, భూసేకరణ అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కీలకమవుతుందని నేతలు అభిప్రాయపడ్డారు.

ఆదిలాబాద్ ప్రాంతానికి విమాన సౌకర్యం కల్పించాలనే డిమాండ్ చాలా కాలంగా కొనసాగుతోంది. విమానాశ్రయం ఏర్పాటుతో పారిశ్రామిక, వ్యాపార, పర్యాటక రంగాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అటవీ, ఖనిజ సంపద కలిగిన ఆదిలాబాద్ జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి కేంద్ర రక్షణ శాఖ అనుమతులు కీలకంగా మారనున్నాయి. భూభాగ వినియోగం, భద్రతా అంశాలు, సాంకేతిక అనుమతులపై రక్షణ శాఖతో సమన్వయం కొనసాగుతున్నట్లు సమాచారం. త్వరలోనే ప్రాజెక్టుకు సంబంధించి తదుపరి చర్యలు వేగవంతం చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుపై జరిగిన ఈ సమావేశం జిల్లాలో రాజకీయ, ప్రజా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రాజెక్టు త్వరగా అమలు కావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో జగిత్యాల ప్రాంతం విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ శివారులోని సర్వే నెంబర్ 437లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రీయ విద్యాలయ నిబంధనలకు అనుగుణంగా స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా భూమి కేటాయించాలని నివేదించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కూడా ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు.

నర్సింగాపూర్ ప్రాంతంలో ఇప్పటికే ముప్పై మూడు కోట్ల రూపాయల వ్యయంతో ఐటీఐ, అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. వృద్ధాశ్రమం కూడా అక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రీయ విద్యాలయం రావడంతో ఆ ప్రాంతం పూర్తి స్థాయి విద్యా కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తోందని వివరించారు. చల్‌గల్ ప్రాంతంలోని వ్యవసాయ పరిశోధనలకు సంబంధించిన భూముల్లో పన్నెండు ఎకరాలను యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం కోసం కేటాయించినట్లు మంత్రి తెలిపారు. అయితే వ్యవసాయ పరిశోధనల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అంతకంటే ఎక్కువ భూమిని అక్కడ కేటాయించే అవకాశం లేదని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అందరూ సహకరించాలని కోరారు.

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. టీఆర్ నగర్ నర్సింగాపూర్ శివారులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ఈ ప్రాజెక్టు కీలకమవుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమగ్ర ప్రణాళికతో అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ హకీమ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓఆర్‌ఆర్‌పై ఎయిర్ ఇండియా బస్సుకు మంటలు

(మొదటి పేజీ తరువాయి)

బస్సు వెనుక భాగం నుంచి దట్టమైన పొగలు రావడంతో ప్రయాణికులు అప్రమత్తమై వెంటనే డ్రైవర్‌కు సమాచారం అందించారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. ప్రయాణికులను వేగంగా కిందకు దింపే ప్రయత్నం చేశారు. ప్రయాణికులు దిగుతుండగానే మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. కొద్ది నిమిషాల్లోనే బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. భారీగా ఎగసిపడుతున్న మంటలు, పొగలు చూసి అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఔటర్ రింగ్ రోడ్డుపై మంటల్లో చిక్కుకున్న బస్సు కారణంగా ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు భయంతో తమ వాహనాలను నెమ్మదిగా ముందుకు తీసుకెళ్లారు. కొంతసేపు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే ట్రాఫిక్‌ను మళ్లించే చర్యలు చేపట్టారు.

ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. చాలా సేపటి తర్వాత మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రాథమిక అంచనా ప్రకారం బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. సాంకేతిక లోపాలపై కూడా పరిశీలన కొనసాగుతోంది. ప్రమాద సమయంలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రాణనష్టం తప్పిందని అధికారులు తెలిపారు.

పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల అసలు కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు పేర్కొన్నారు.

# అంతర్జాతీయ సెయిలింగ్‌లో రమేజా భాను ప్రతిభ

(మొదటి పేజీ తరువాయి)

ప్రశంసించారు. ఒమన్, సింగపూర్ దేశాల్లో నిర్వహించిన అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో రమేజా భాను భారత్ తరపున పాల్గొని ఆకట్టుకునే ప్రదర్శన కనబరిచారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పోటీల్లో ప్రతిభ చాటుతూ యువ క్రీడాకారిణిగా గుర్తింపు పొందుతున్నారు. వచ్చే వారం మొరాకోలో జరగనున్న అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో కూడా ఆమె భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఈ సందర్భంగా రమేజా భాను మంత్రి సీతక్కను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆమెను అభినందించిన మంత్రి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ యువత అంతర్జాతీయ వేదికలపై దేశానికి కీర్తి తీసుకురావడం ఎంతో గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. రమేజా భాను వంటి ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీతక్క హామీ ఇచ్చారు. క్రీడారంగంలో యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. మొరాకోలో జరగనున్న పోటీల్లో కూడా రమేజా భాను విజయంతో తిరిగి రావాలని మంత్రి ఆకాంక్షించారు. ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ మరింత కృషితో ప్రపంచ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని సూచించారు. రాష్ట్రానికి, దేశానికి మరింత గౌరవం తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

రమేజా భాను విజయాలు తెలంగాణ యువతకు స్ఫూర్తిదాయకమని క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ సెయిలింగ్ రంగంలో ఆమె సాధిస్తున్న విజయాలు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు.

# భూ బాధితులకు న్యాయం చేయాలని గవర్నర్‌కు వినతి

(మొదటి పేజీ తరువాయి)

ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్‌తో పాటు వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి ప్రాంతాల బాధితులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. భూసేకరణ, ఇండ్ల కూల్చివేత, రహదారి అలైన్‌మెంట్ మార్పుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతలు, ట్రిపుల్ ఆర్ రహదారి అలైన్‌మెంట్ మార్పులు, రాయగిరి భూసేకరణ, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం జరుగుతున్న భూసేకరణ ప్రయత్నాలపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు కవిత తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకుని చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గవర్నర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల ఇళ్లు కూల్చి వారిని మానసికంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు వంద రూపాయల చీరలు ఇచ్చి కోటీశ్వరులను చేశామంటూ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతల సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కవిత పేర్కొన్నారు. ఒక మహిళకు గర్భస్రావం జరిగిన ఘటన ఇప్పటికీ మర్చిపోలేమని అన్నారు. రైతుల ధాన్యం కొనుగోళ్లు కూడా నిలిచిపోయాయని, రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆవేదనలో ఉన్నారని తెలిపారు. వెంటనే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ రహదారి అలైన్‌మెంట్ నాలుగు సార్లు మార్చిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కవిత తెలిపారు. ఈ అంశంపై గవర్నర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారని చెప్పారు. కేంద్ర మంత్రికి సంబంధించిన లేఖలను కూడా గవర్నర్‌కు చూపించినట్లు వివరించారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తామని, అప్పటికీ బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమ బాట పడతామని కవిత స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్న అన్ని మార్గాల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. భూ నిర్వాసితుల సమస్యలపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

## రేటింగ్ పేరుతో మోసం

- ఆన్‌లైన్ రివ్యూల పేరుతో కొత్త మోసాలు
- అపరిచిత లింకులకు దూరంగా ఉండాలని హెచ్చరిక

**హైదరాబాద్, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఆన్‌లైన్‌లో హోటళ్లు, రెస్టారెంట్లు, వ్యాపార సంస్థలకు మంచి రేటింగ్ ఇవ్వాలని కోరుతూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. "రేటింగ్ ఇస్తే డబ్బులు వస్తాయి" అంటూ ప్రజలను ఆకర్షించి వారి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం దోచుకుంటున్నారని తెలిపారు. సైబర్ మోసగాళ్లు మొదట వాట్సాప్ లేదా టెలిగ్రామ్ ద్వారా సంప్రదించి, గూగుల్ మ్యాప్స్‌లో ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తే డబ్బులు చెల్లిస్తామని చెబుతున్నారని పోలీసులు వెల్లడించారు. అపరిచిత వ్యక్తులు పంపించే లింకులను క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని తెలంగాణ పోలీసులు సూచించారు. ఆన్‌లైన్‌లో సులభంగా డబ్బు వస్తుందంటూ వచ్చే ప్రకటనలను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేసి వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. అప్రమత్తతే సైబర్ మోసాల నుంచి రక్షణ అని పోలీసులు పేర్కొన్నారు. సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్ ద్వారా పెరుగుతున్న మోసాలపై ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అనుమానాస్పద సందేశాలు వచ్చినా వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ధృవీకరించుకోవాలని సూచించారు. ప్రజల అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్టగలమని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు.

# ప్రజా పాలనపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

అమలుపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా చేరవేసే విధానాలపై మంత్రులు, అధికారులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమాల అమలు, ప్రజల్లో అవగాహన కల్పించడం, శాఖల సమన్వయం వంటి అంశాలపై పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని నిర్ణయించారు. జూన్ 2 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "ప్రజా పాలన ప్రగతి నివేదిక" కార్యక్రమాల రూపకల్పనపై సమావేశంలో సమగ్ర చర్చ జరిగింది.

ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి పేద కుటుంబానికి భరోసా కల్పించే లక్ష్యంతో "ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సి.వి. ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

# గడ్డివాము దగ్ధం ఘటనపై స్పందించిన చైర్మన్ దిలీప్

**జమ్మికుంట టౌన్ మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ పరిధిలోని 22వ వార్డులో కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గడ్డివాము, పశువుల మేత దగ్ధమైన ఘటన కలకలం రేపింది. స్థానికుడు మంద రాజేష్ సమాచారం మేరకు మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాదిక్‌కు చెందిన పశువుల మేత (గడ్డివాము) పూర్తిగా అగ్నికి ఆహుతైందని, పరిస్థితులను బట్టి చూస్తే కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ ఘటనలో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. అలాగే స్థానికుడు జాకీర్‌కు చెందిన కారు కూడా మంటల్లో దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ప్రమాద సమయంలో ఫైర్ సిబ్బంది అందుబాటులో లేకపోయినా, మున్సిపల్ సిబ్బంది బోళ్ల సదానందం వాటర్ ట్యాంకర్‌తో వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. స్థానిక యువకులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ ఎండాకాలంలో ప్రజలు విద్యుత్ పరికరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని చైర్మన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్ చందా రాజు తదితరులు పాల్గొన్నారు.



# భగీరథ్‌కు మూడు రోజుల కస్టడీ

**హైదరాబాద్, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసులో మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఉత్తర్వులు వెలువరించింది. భగీరథ్‌ను వారం రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతివ్వాలని పోలీసులు కోర్టును కోరారు. అయితే ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం మూడు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతించింది. ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. పోలీసు కస్టడీ పిటిషన్‌ను భగీరథ్ తరపు న్యాయవాది కరుణాసాగర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవేళ కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని కోర్టును కోరారు. విచారణకు ముందు, తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించాలని కూడా విజ్ఞప్తి చేశారు. విచారణ సమయంలో బలవంతపు పద్ధతులు ఉపయోగించకుండా పోలీసులను ఆదేశించాలని భగీరథ్ తరపు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. న్యాయపరమైన హక్కులను కాపాడాలని కోరుతూ పలు షరతులు విధించాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు ఈ అంశాలపై కూడా సూచనలు చేసినట్లు సమాచారం.

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోలీసులు కేసులో మరిన్ని కఠిన సెక్షన్లు జోడించారు. మే 16న హైకోర్టులో మధ్యంతర రక్షణ లభించకపోవడంతో భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే తన కుమారుడు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయాడని బండి సంజయ్ పేర్కొన్నారు. నేరాన్ని అంగీకరించిన తర్వాతే అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కోర్టు భగీరథ్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



## ఉర్సు ఉత్సవాల్లో భక్తులకు పూర్తి భద్రత కల్పిస్తాం : సీపీ గౌస్ ఆలం

**జమ్మికుంట టౌన్ మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** బిజిగీర్ షరీఫ్ దర్గాలో ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బిజిగీర్ షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న బందోబస్తు చర్యలను కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్‌లతో కలిసి దర్గా వద్ద ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం దర్గాలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లా అలై, హజ్రత్ సయ్యద్ అజ్మత్ షావలి రహమతుల్లా అలై, హజ్రత్ సయ్యద్ అక్బర్ షావలి రహమతుల్లా అలై సమాధులను దర్శించుకుని చాదర్లు సమర్పించారు. మత గురువు మౌలానా మొహమ్మద్ నౌమాన్ హస్మి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్‌కు శాలువాతో సన్మానం చేశారు.

ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఉర్సు ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, స్పెషల్ టీం పోలీసులతో నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బిజిగీర్ షరీఫ్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాచపల్లి వనజరాజయ్య, కార్యదర్శి ఇంగ్లే రాజు, దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫీక్ హుస్సేన్, కార్యదర్శి మొహమ్మద్ జమాల్ అష్రాఫ్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయీముద్దీన్, సభ్యులు సర్వర్, అలీ షరీఫ్, అజ్మత్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.





# గ్రామ దీపికల డిమాండ్లు తీర్చాలి.!

### కాంగ్రెస్‌పై మెచ్చా విమర్శలు

**అశ్వారావుపేట, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామ దీపికల (వీఓఏలు) న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అశ్వారావుపేట రింగు రోడ్డు వద్ద గత నాలుగు రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న గ్రామ దీపికల దీక్షా శిబిరాన్ని ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండలను సైతం లెక్కచేయకుండా మహిళలు న్యాయం కోసం రోడ్డెక్కి పోరాడుతుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం ఏసీ గదుల్లో సేదతీరుతున్నారని విమర్శించారు. మహిళల కష్టం, ఆవేదన పాలకులకు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు కన్నీరు పెట్టుకున్న రాజ్యం ఎప్పుడూ బాగుపడలేదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వీఓఏలకు గౌరవ వేతనం రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచామని గుర్తు చేశారు. ప్రస్తుతం పనిభారం పెరిగినా తగిన వేతనం, గుర్తింపు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో వీఓఏలకు రూ.20 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. గ్రామ దీపికల సమస్యలను పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం చేపడతామని తెలిపారు. గ్రామ దీపికలందరికీ వెంటనే రూ.20 వేల వేతనం అమలు చేసి, వారి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కాసాని నాగశేష పద్మ (చంద్రమోహన్) గ్రామ దీపికలకు కొబ్బరి నీళ్లు, భోజనం అందజేశారు. కార్యక్రమంలో జూపల్లి రమణరావు, మాజీ జడ్పీటీసీ సున్నం నాగమణి, ప్రకాశ్‌రావు, భూక్యా ఉదయజ్యోతి, జజ్జూరపు శ్రీరామ్‌మూర్తి, సత్యవరపు సంపూర్ణ, నారం రాజ్‌శేఖర్, జ్యోత్స్న, గోవింద్, జీవన్‌రావు, తగరం జగన్నాథం, వేలేటి పార్వతి తదితరులు పాల్గొన్నారు.






# సమన్వయంతోనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యం

**ఎల్కతుర్తి, మే 26( తెలంగాణ ముచ్చట్లు):** సమాజంలోని ప్రతి వర్గం సమన్వయంతో పనిచేస్తేనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమవుతుందని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిషేధ చట్టం-2006 మరియు "బాల్య వివాహ ముక్త్ భారత్"పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలు అనేక అసమానతలకు గురవుతున్నారని, వాటి నివారణకు బాలిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బాల్య వివాహాల నివారణలో మత గురువుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన, బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్ మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం బాల్య వివాహం శిక్షార్హమైన నేరమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ విషయంలో అప్రమత్తంగా పనిచేస్తున్నామని చెప్పారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా బాల్య వివాహ నిర్మూలనపై రూపొందించిన గోడపత్రికలను అదనపు కలెక్టర్ రవి ఆవిష్కరించారు. అనంతరం బాల్య వివాహ నిర్మూలన ప్రతిజ్ఞను అధికారులు, మత పెద్దలు చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు, ఖాజీలు, పాస్టర్లు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## జూన్ 2లోగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ చేయాలి

- **లేకపోతే అర్హులతో కలిసి ఉద్యమం తప్పదు : కొత్తూరి రమేష్**

**హుజురాబాద్,మే 26(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ లో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌ను( RDO) కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీపై వినతి పత్రం అందజేసినట్లు సేవ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, న్యాయవాది కొత్తూరి రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, గతంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కె,చంద్రశేఖర్ రావు సంకల్పంతో ఇండ్లు లేని పేదల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించినా రాని అన్నారు. అయితే నిర్మాణాలు పూర్తయి దాదాపు 10 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అర్హులైన పేదలకు పంపిణీ జరగకపోవడం బాధాకరమని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు దాటినా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ విషయంలో స్పష్టత లేకపోవడంతో పేదల్లో ఆందోళన నెలకొందన్నారు. ఎన్నో కోట్ల రూపాయలతో నిర్మించిన ఇళ్లు ప్రస్తుతం వాడకం లేక శిథిలావస్థకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులైన ఇండ్లు లేని పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని, ముఖ్యంగా వితంతువులు, వికలాంగులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఇళ్ల పంపిణీ చేపట్టకపోతే అర్హులైన బాధితులతో కలిసి జేఏసీ ఏర్పాటు చేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్వాధీనం చేసుకునే ఉద్యమానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కాసుగోని కిరణ్ కుమార్, సుమన్, రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.






# ఇంధన ధరల పెంపుపై వనపర్తిలో ఎద్దుల బండ్లతో కాంగ్రెస్ నిరసన

**వనపర్తి,మే26(తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలో ఎద్దుల బండ్లతో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంధన ధరల పెంపుతో సామాన్య ప్రజలు, రైతులు, నిరుపేదలపై తీవ్ర భారం పడుతోందని అన్నారు.ధరలను తగ్గించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని, కానీ ప్రజలపై అదనపు భారం మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. గంటలు మోగించడం, చప్పట్లు కొట్టడం వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావని, ప్రజలకు మేలు చేసే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని, దీనివల్ల రైతులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇంధన ధరలను వెంటనే తగ్గించకపోతే జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వడ్ల కొనుగోలు, ఎఫ్‌సీఐ, గోదాముల సమస్యల పరిష్కారంలో కేంద్రం సరైన చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు.ప్రజల సమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 28వ వార్డులో డ్రైన్ సమస్యకు తాత్కాలిక పరిష్కారం

**జమ్మికుంట టౌన్ మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని 28వ వార్డులో డ్రైన్ సమస్యను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మంగళవారం పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ ఒగ్గు రమేష్ ఆహ్వానం మేరకు మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామితో కలిసి ఆయన వార్డును సందర్శించారు. శిశుమందిర్ పాఠశాల నుండి బద్రి షాప్ సెంటర్ వరకు ఉన్న డ్రైన్ కారణంగా పరిసర ప్రాంత గృహవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, ప్రస్తుతం తాత్కాలికంగా పరిష్కరించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కొత్త డ్రైన్ నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.



వర్షాకాలంలో అధిక వర్షాల కారణంగా మళ్లీ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటూ, ప్రజలు ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు తదితర చెత్తను డ్రైన్లలో వేయకుండా చెత్త బుట్టల్లో వేసి చెత్త బండికి అందించాలని సూచించారు. ప్రజల సహకారం ఉంటేనే పారిశుద్ధ్య సమస్యలు తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, బోళ్ళ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా వారోత్సవాల నిర్వహణ

**వేలేరు, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వేలేరు మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మహిళా వారోత్సవాలు మండల ఏపీఎం అనిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిల్లా యాదగిరి, వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక రాయితీ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలకు



సబ్సిడీపై యంత్రాలను కూడా మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 1564 మంది మహిళలు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అలాగే గ్రామంలోని మహిళా సంఘాలకు ప్రత్యేకంగా వివో బిల్డింగ్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మంజూరు చేయించి, నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, సీసీ నాగమణి, అలాగే గ్రామంలోని వివిధ మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలి



- **పేదల సహనాన్ని పరీక్షించొద్దు : సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**

**జమ్మికుంట టౌన్ మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మికుంటలో వడ్లూరి కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

201718లో ప్రారంభించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం 80 శాతం పూర్తయినా, ఇప్పటికీ లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఖాళీగా ఉన్న ఇండ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లను వెంటనే పూర్తి చేసి, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు కేటాయించాలని కోరారు. ఇళ్ల పంపిణీలో జరుగుతున్న జాప్యం వల్ల తలుపులు, కిటికీలు, ఇతర సామగ్రి పాడైపోతున్నాయని తెలిపారు. అధికారులు పరిశీలనల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పేదలు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇళ్లను పంపిణీ చేయకుంటే పేదలతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

అలాగే రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటల కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. తేమ, తాలు పేర్లతో రైస్ మిల్లర్లు క్వింటాల్‌కు 6 నుంచి 10 కిలోల వరకు కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

వేసవికాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్లు ఎండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అవసరమైతే వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని అధికారులను కోరారు.

ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కొప్పుల శంకర్, గండిగారి సతీష్, జక్కుల రమేష్, బసిర సంపత్‌రావు, వడ్లూరి కిషోర్, మధునయ్య, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి




- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి**

**హైదరాబాద్,మే26(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నిరుద్యోగ యువత కవాతుతో దద్దరిల్లింది. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులతో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించిన నిరుద్యోగ యువత పత్రికా విలేకరుల సమక్షంలో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైందని ప్రశ్నించారు. వెంటనే 20 వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని, జీవో 46ను రద్దు చేయాలని, మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను ఏడాదిలోనే భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. నిరుద్యోగ భృతి రూ.4 వేల హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రతి రెండేళ్లకోసారి పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలయ్యేదని, కనీసం ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు. తక్షణమే జీవో 87ను రద్దు చేయాలని, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై అభ్యర్థుల వయోపరిమితిని 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు సంవత్సరాలుగా ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 18 వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగ భృతి పూర్తిగా నీరుగారిపోయిందని, రాజీవ్ యువ వికాసం పథకం అమలు కాకముందే వాడిపోయిందని విమర్శించారు. పోలీస్ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి శ్రమించిన యువత చివరకు చిరు వ్యాపారాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# అగ్నికి ఆహుతైన పశుగ్రాసం.. రైతు రవీందర్ ఆవేదన





**ఎల్కతుర్తి, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం, వీరనారాయణపూర్ గ్రామంలో వరి కొయ్యలను కాల్చడం వల్ల చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీరనారాయణపూర్ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పాడి రైతు నార్లగిరి రవీందర్ గారి పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిదైంది. దీంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, పొలాల్లో వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు గాలివేగానికి వ్యాపించి సమీపంలో నిల్వ ఉంచిన పశుగ్రాసానికి అంటుకున్నాయి. కొద్దిసేపట్లోనే మంటలు భారీగా వ్యాపించడంతో పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న స్థానికులు, రైతులు కలిసి మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. పెద్ద ప్రమాదం తప్పినప్పటికీ రైతుకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు. వ్యవసాయ నిపుణులు మాట్లాడుతూ, వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమిలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూమి సారం తగ్గిపోతుందని హెచ్చరించారు. అలాగే పొగ కారణంగా గాలి కాలుష్యం పెరిగి ప్రజలకు శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అదుపు తప్పిన మంటలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, పశుగ్రాసం మరియు ఇతర ఆస్తులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతులు వరి కొయ్యలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని అధికారులు సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పశుసంపద రక్షణ ప్రతి రైతు బాధ్యతగా భావించాలని కోరారు.

# రాపాకపల్లిలో ఎమ్మార్పీఎస్ గద్దె నిర్మాణ పనులు ప్రారంభం



**ధర్మసాగర్,మే26(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని రాపకపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పులిపాక చిరంజీవి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన గద్దె నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ హాజరై స్థానిక సర్పంచ్ కందుకూరి జయేందర్‌తో కలిసి ముగ్గు వేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ దీర్ఘకాల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. ఉద్యమాల ద్వారా సాధించుకున్న వర్గీకరణ ఫలాలను గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువు మధ్యలో నిలిచిపోయిన విద్యార్థులు మళ్లీ విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చదువుకునే యువతకు ఎమ్మార్పీఎస్ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు. అలాగే గ్రామాల సందర్శన కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విజయవంతం చేసి ఉద్యమ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమాన్ని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి, ధర్మసాగర్ మండల ఇన్చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇమ్మడి సురేష్, కందుకూరి కరుణాకర్ మాదిగ, కందుకూరి శ్యామ్ సుందర్ మాదిగ, ఇమ్మడి ఉప్పలయ్య మాదిగ, ఇమ్మడి కరుణాకర్ మాదిగ, వస్కుల దేవరాజ్ మాదిగ, కందుకూరి కరణ్ మాదిగ, కందుకూరి మల్లేశం మాదిగతో పాటు పలువురు గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# భూసార పరిరక్షణే ధ్యేయం

- **దమ్మపేటలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ.**



**దమ్మపేట, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** భూసార ఆరోగ్య పరిరక్షణతోనే పంట దిగుబడులు పెరుగుతాయని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండల కేంద్రంలో మంగళవారం వ్యవసాయశాఖ, సహకారశాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంచడంలో పచ్చిరొట్ట పంటలు కీలకమని తెలిపారు. జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తున్నందున రైతులు వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి పచ్చిరొట్ట సాగును ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి-రాంబాబు, సొసైటీ ఉపాధ్యక్షుడు కట్టం యర్రప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, రావు గంగాధర్ రావు, గుజ్జుల శ్రీనివాసరావు, బొల్లికొండ నాగేశ్వరరావు, చిన్నశెట్టి సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలు, ర్యాలీలతో బడిబాటకు శ్రీకారం




**ఎల్కతుర్తి, మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా గ్రామసభలు, బడిబాట ర్యాలీలతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలలో భాగంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై చర్చించారు. జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి సునీత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు కనీసం 20 శాతం అదనంగా నమోదు పెంచే లక్ష్యంతో పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. జూన్ 3న ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతో కలిసి గ్రామసభలు, బడిబాట ర్యాలీలు భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎంపీడీవో విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్య అందుతున్నందున పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అయ్యపురెడ్డి వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



**వనపర్తి,మే26(తెలంగాణ ముచ్చట్లు):** అయ్యపురెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు.విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించే ఉద్దేశంతో పెద్దమందడి, వనపర్తి ప్రాంతాలకు చెందిన 50 మంది విద్యార్థులకు సుమారు రూ.30 వేల విలువైన స్కూల్ బ్యాగులను అందజేశారు.చేయుత అనాథ ఆశ్రమంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కీ.శే. అయ్యపురెడ్డి సేవలను స్మరించుకుంటూ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# హుజురాబాద్ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆపాలి



- **డంప్ యార్డ్ రద్దుకు ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**హుజురాబాద్,మే 26(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ నియోజకవర్గంలోని సిర్సపల్లి గ్రామంలో ప్రతిపాదిత డంప్ యార్డ్ ఏర్పాటును వెంటనే రద్దు చేస్తూ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో సీడీఎంఏ శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డంప్ యార్డ్ రద్దు కోసం హుజురాబాద్ ప్రాంత ప్రజలు, జేఏసీ నాయకులు, ప్రజాసంఘాలు గత కొంతకాలంగా ఆందోళనలు, నిరసనలు, నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా డంప్ యార్డ్ ఏర్పాటు చేయడం పూర్తిగా ప్రజా వ్యతిరేక చర్య అని విమర్శించారు. డంప్ యార్డ్ కారణంగా పరిసర గ్రామాల్లో గాలి, నీరు, భూమి కాలుష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, చెత్త నుంచి వెలువడే విషపూరిత వాయువులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు, అంటువ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే భూగర్భ జలాలు కలుషితమై రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి తలెత్తుతుందని పేర్కొన్నారు.

హుజురాబాద్ ప్రజల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల తరపున ఎన్నోసార్లు ప్రభుత్వ పెద్దలకు, అధికార యంత్రాంగానికి విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు అధికారిక జీవో లేదా స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడం వెనుక కారణాలు అర్థం కావడం లేదన్నారు.

ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని వెంటనే డంప్ యార్డ్ నిర్ణయాన్ని రద్దు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగని ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని గుర్తించాలని సీడీఎంఏ శ్రీదేవిని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు.

ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయకపోతే హుజురాబాద్ ప్రజలతో కలిసి మరింత ఉద్ధృతమైన ఉద్యమానికి సిద్ధమవుతానని ఎమ్మెల్యే హెచ్చరించారు.

# జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కరీంనగర్ సీపీ

- **సాంకేతికత వినియోగంతో కేసుల త్వరిత పరిష్కారంపై దృష్టి**



**జమ్మికుంట టౌన్ మే 26 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మంగళవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న సీపీకి టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు.

తనిఖీలో భాగంగా స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్ ఇండెక్స్, పెండింగ్ కేసుల వివరాలను సీపీ పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

తెలంగాణ పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన సీసీటీఎన్ఎస్ 2.0, టీఎస్‌కాప్, ఈసాక్ష్య, సైబర్ క్రైమ్ టూల్స్, బాడీ వార్న్ కెమెరాల వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలపై పోలీస్ సిబ్బంది పూర్తి అవగాహన పెంపొందించుకొని, రోజువారీ విధుల్లో సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు.

జమ్మికుంట పరిధిలోని గ్రామాలను సెక్టార్లు, సబ్ సెక్టార్లుగా విభజించి గ్రామ పోలీస్ అధికారులను నియమించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు.

పోలీస్ సిబ్బంది విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, రిసెప్షన్ విధులు, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమ కారుడికి న్యాయం జరిగే వరకు పోరాటం

- **తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు పిడమర్తి**




**ఖమ్మం,మే26(తెలంగాణ ముచ్చట్లు-):** ఖమ్మంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి రడం సురేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, యువత, ప్రజలు క్రియాశీలకంగా పాల్గొని అలుపెరుగని పోరాటం చేయడం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయడం కోసం కేకే ఆధ్వర్యంలో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా అందరూ కలిసి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 21న హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనాన్ని భారీ స్థాయిలో నిర్వహిస్తున్నామని, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులందరూ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల పోరాట ఫలితంగానే సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేశారని అన్నారు. ఆ కృతజ్ఞతతోనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ సీనియర్ ఉద్యమకారులు డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, పొనుగోటి సంపత్, నందిగామ రాజ్‌కుమార్, లింగనబోయిన సతీష్, చీకటి కార్తీక్, పమ్మి రవి, పాలకుర్తి కృష్ణ, బత్తిని మధు గౌడ్, భూక్యా నాగేశ్వరరావు, కోడిరెక్క ఉమాశంకర్, బొబ్బిల్ల భరత్ చంద్ర, దరిపల్లి వీరబాబు, చౌహాన్‌తో పాటు 1969 ఉద్యమకారులు ఎండీ ఖాసీం, రమాదేవి, బొడ్డు గ్లోరీ, కొరివి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ పొలిటికల్ లీడర్ అవార్డు అందుకున్న కొలిపాక సతీష్




**స్టేషన్ ఘనపూర్,మే26(తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా ఘనపూర్ స్టేషన్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొలిపాక సతీష్‌ను హైదరాబాద్‌లో నాయీబ్రాహ్మణ జనసంస్థ ఆధ్వర్యంలో "ఉత్తమ రాజకీయ నాయకుడు" అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు.నాయీబ్రాహ్మణ జనసంస్థ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో సీసీఎం మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ భారత ప్రభుత్వం డాక్టర్ సారంగపాణి, కార్టూనిస్ట్ నారు, సుధాకర్, శ్రీధర్, ఓయూ రాజేశ్, ప్రొఫెసర్ సావిత్రి, దుర్గారాణి తదితరులు కలిసి శాలువా కప్పి మెమెంటో అందజేశారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కొలిపాక సతీష్ గత 28 సంవత్సరాలుగా రాజకీయాల్లో నిస్వార్థంగా కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నీతి నిజాయితీతో ఒకే పార్టీ అయిన కాంగ్రెస్‌లో కొనసాగుతూ ప్రజలకు సేవ చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు.

గతంలో కూడా కొలిపాక సతీష్ సేవలకు పలువురు సంస్థలు గుర్తింపునిచ్చాయి. 2024లో తిరుపతిలో జాతీయ సేవారత్న అవార్డు అందుకున్నారు. అలాగే సావిత్రిబాయి పూలే నాయీబ్రాహ్మణ సంస్థ ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా హనుమకొండ సెలూన్ అసోసియేషన్ ప్రత్యేకంగా సన్మానించింది.ఈ కార్యక్రమంలో సుశీల్, గోవిందరాజు, గోపాలకృష్ణ, సుబ్బయ్య, రమేష్, అశోక్ కుమార్, నవనీత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వయసులో పెళ్లిళ్లు.. జీవితాలకు ముప్పు




**హుజురాబాద్,మే 26(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మహిళా వారోత్సవాల సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజానికి శాపంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వయసులో పెళ్లిళ్లు జరగడం వల్ల బాలికల చదువు మధ్యలోనే ఆగిపోతుందని, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తడంతో పాటు వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నివారణలో బాధ్యతగా వ్యవహరించాలని, ఎక్కడైనా ఇలాంటి ఘటనలు తెలిసినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రభుత్వం బాల్య వివాహాల నిరోధానికి కఠిన చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ సమాజంలో ఇంకా కొన్ని చోట్ల ఈ దురాచారం కొనసాగుతుండటం బాధాకరమన్నారు. బాలికలకు విద్య, భద్రత, స్వేచ్ఛ కల్పించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, యువతులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి.. వివరాలు తెలియజేయాలని పోలీసుల విజ్ఞప్తి

**భీమదేవరపల్లి,మే26(తెలంగాణ ముచ్చట్లు):** కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, మున్నంగి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తేది 22 052026 మధ్యాహ్నం సమయంలో కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుండి 43 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. అతడు ఎండ తీవ్రత, అస్వస్థత కారణంగా మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి జేబులో ముల్కనూర్ నుండి హనుమకొండకు చెందిన RTC బస్ టికెట్ లభించినట్లు తెలిపారు. చుట్టుపక్కల వారిని విచారించినప్పటికీ మృతుడి వివరాలు తెలియరాలేదని, అనంతరం మృతదేహాన్ని వరంగల్ MGM ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు లేదా బంధువుల సమాచారం తెలిసిన వారు 8712685004, 8712685115, 8712685089, 8712685088 నంబర్లకు సమాచారం అందించాలని ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్. రవి కుమార్ కోరారు.



# తాపీ మేస్త్రీలను కించపరిచే వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి

- **భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్**



**హన్మకొండ,మే26(తెలంగాణ ముచ్చట్లు):** ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రమశక్తి అవార్డు గ్రహీత గిన్నారపు మహేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సెంట్రింగ్ మేస్త్రీల సమావేశంలో "తాపీ మేస్త్రీ హటావో.. సెంట్రింగ్ బచావో" అనే వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తాపీ మేస్త్రీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్ మేస్త్రీలు ఇద్దరూ భవన నిర్మాణ రంగానికి రెండు కళ్లలాంటివారని పేర్కొన్నారు. ఒక నాణానికి రెండు వైపులా ఉన్నట్టే ఈ రెండు వృత్తుల కార్మికులు సమాజ నిర్మాణంలో సమాన బాధ్యత వహిస్తున్నారని తెలిపారు. ఒక భవనం నిర్మాణం పూర్తవ్వాలంటే తాపీ మేస్త్రీ, సెంట్రింగ్ మేస్త్రీ ఇద్దరి కృషి అవసరమని, అలాంటి వారిని విడదీసి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. కార్మికుల మధ్య విభేదాలు సృష్టించేలా చిల్లర రాజకీయ వ్యాఖ్యలు చేయడం తగదని హెచ్చరించారు. కొంత మంది బాధ్యత లేకుండా మాట్లాడితే తాము కూడా గట్టిగానే స్పందించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కార్మిక సంఘాల నుంచి ఎదిగి స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో రాణిస్తున్న నాయకులు కూడా ఉన్నారని గుర్తు చేశారు.ఇకపై ఎవరైనా తాపీ మేస్త్రీలను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తే లేదని, పాలునీళ్లలా కలిసి పనిచేసే కార్మికులను విడదీసే ప్రయత్నాలను కార్మిక లోకం తిప్పికొడుతుందని గిన్నారపు మహేందర్ హెచ్చరించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్




# ఏఐ ప్రభావంతో కోట్ల ఉద్యోగాలకు ముప్పు: సౌరభ్ హెచ్చరిక

భారత్‌లో వైట్ కాలర్ ఉద్యోగాలకు రాబోయే సంవత్సరాల్లో తీవ్ర ముప్పు పొంచి ఉందని ప్రముఖ మార్కెట్ నిపుణుడు సౌరభ్ ముఖర్జీయా హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తుండటంతో, ప్రస్తుతం మనుషులు చేస్తున్న అనేక పనులను కంపెనీలు ఆటోమేట్ చేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీంతో కోట్లాది ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సౌరభ్ ముఖర్జీయా.. ఏఐ ప్రభావం టెక్నాలజీ రంగానికే పరిమితం కాదని, భవిష్యత్తులో అన్ని రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం టెక్ కంపెనీల్లో కనిపిస్తున్న ఉద్యోగ కోతలు కేవలం ప్రారంభ సంకేతాలేనని, అసలు ప్రభావం ఇంకా ముందుందని వ్యాఖ్యానించారు.

2030 నాటికి భారత్‌లో సుమారు 1.8 కోట్ల వైట్ కాలర్ ఉద్యోగాలు ఏఐ కారణంగా మాయమయ్యే అవకాశముందని ఆయన అంచనా వేశారు. మరోవైపు కొత్తగా కేవలం 30 లక్షల టెక్ ఉద్యోగాలే సృష్టించబడతాయని పేర్కొన్నారు. ఈ లెక్కన దాదాపు 1.5 కోట్ల ఉద్యోగాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కోడింగ్, డేటా విశ్లేషణ, డిజిటల్ టాస్క్‌ల వంటి రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోందని సౌరభ్ చెప్పారు. ఇప్పటికే కొన్ని కంపెనీలు మానవ వనరుల అవసరాన్ని గణనీయంగా తగ్గిస్తున్నాయని, ప్రస్తుతం ఇది 50 శాతం వరకు ప్రభావం చూపుతోందన్నారు. మరో రెండు నుంచి మూడు సంవత్సరాల్లో ఈ స్థాయి 90 నుంచి 100 శాతం వరకు చేరే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఏఐ అభివృద్ధి కారణంగా కంపెనీలు ఖర్చులను తగ్గించుకునే అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, అదే సమయంలో భారీ స్థాయిలో ఉద్యోగ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఐటీ, ఫైనాన్స్, కస్టమర్ సపోర్ట్, డేటా ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన అవసరం పెరుగుతోందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

అయితే కొందరు నిపుణులు మాత్రం ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాలు కనుమరుగైనా, కొత్త తరహా అవకాశాలు కూడా పుట్టుకొస్తాయని చెబుతున్నారు. టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.



# లాభాల స్వీకరణతో నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

లాభాల స్వీకరణ, అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. సోమవారం భారీ లాభాలు నమోదు చేసిన సూచీలు.. మంగళవారం గరిష్ఠ స్థాయిల వద్ద మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో ఒత్తిడికి గురయ్యాయి. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడటం కూడా మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి పెరగడం పెట్టుబడిదారుల్లో ఆందోళన కలిగించాయి. ఈ ప్రభావంతో దేశీయ సూచీలు రోజంతా ఒడిదుడుకులకు లోనయ్యాయి.

గత సెషన్‌లో 76,488 వద్ద ముగిసిన సెన్సెక్స్.. మంగళవారం ఉదయం ప్రారంభంలోనే దాదాపు 250 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్ మొదలుపెట్టింది. మధ్యాహ్నం కొంతమేర కోలుకున్నప్పటికీ, చివరి గంటల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మళ్లీ దిగజారింది. చివరకు సెన్సెక్స్ 479 పాయింట్లు కోల్పోయి 76,009 వద్ద ముగిసింది.

అదే విధంగా నిఫ్టీ కూడా నష్టాల బాటలోనే కొనసాగింది. రోజంతా హెచ్చుతగ్గుల మధ్య ట్రేడైన నిఫ్టీ చివరకు 118 పాయింట్లు పడిపోయి 23,913 వద్ద స్థిరపడింది.

మార్కెట్‌లో కొన్ని షేర్లు మాత్రం మంచి లాభాలు నమోదు చేశాయి. ముఖ్యంగా ఎక్సైడ్ ఇండస్ట్రీస్, అదానీ పవర్, ఇన్ఫో ఎడ్జ్, అదానీ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు లాభాల్లో నిలిచాయి.

మరోవైపు కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రైల్ వికాస్ నిగమ్, కేన్స్ టెక్నాలజీ, టొరెంట్ ఫార్మా, అశోక్ లేలాండ్ షేర్లు నష్టాలు చవిచూశాయి.

బ్యాంకింగ్ రంగ సూచీ అయిన బ్యాంక్ నిఫ్టీ దాదాపు 200 పాయింట్లు కోల్పోయింది. అయితే మధ్య తరహా కంపెనీల సూచీ అయిన నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ మాత్రం 332 పాయింట్లు పెరిగి మార్కెట్‌కు కొంత మద్దతు ఇచ్చింది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, రూపాయి మారకం విలువ వంటి అంశాలు రాబోయే రోజుల్లో దేశీయ మార్కెట్ల దిశను నిర్ణయించే అవకాశముంది.



# ఫెరారీ నుంచి తొలి పూర్తి ఎలక్ట్రిక్ కారు 'లూస్' ఆవిష్కరణ

ప్రపంచ ప్రఖ్యాత లగ్జరీ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ ఫెరారీ తన తొలి పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరించింది. 'లూస్' పేరుతో రూపొందించిన ఈ అత్యాధునిక ఎలక్ట్రిక్ వాహనం ప్రస్తుతం ఆటోమొబైల్ రంగంలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటలీ భాషలో 'లూస్' అంటే 'కాంతి' అని అర్థం. సుమారు ఆరున్నర లక్షల అమెరికన్ డాలర్ల విలువైన ఈ కారు.. ఫెరారీ చరిత్రలోనే తొలి ఫైవ్ సీటర్ ఎలక్ట్రిక్ మోడల్ కావడం విశేషం.

ఈ కారును ప్రముఖ డిజైన్ సంస్థ లవ్‌ఫ్రమ్ సహకారంతో రూపొందించారు. కొత్త మోడల్‌కు సోషల్ మీడియాలో విశేష స్పందన లభిస్తోంది. కారు డిజైన్‌ను చూసి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఇది నిజమైన మాస్టర్‌క్లాస్ డిజైన్" అంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు.

అయితే ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ కొంత మందగించిన పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా లగ్జరీ ఈవీ విభాగంలో అమ్మకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో లాంబోర్గిని, పోర్స్ వంటి కంపెనీలు ఎలక్ట్రిక్ మోడళ్ల ఉత్పత్తిని జాగ్రత్తగా కొనసాగిస్తున్నాయి. మరోవైపు చైనా కంపెనీల నుంచి తీవ్రమైన పోటీ కూడా గ్లోబల్ లగ్జరీ ఈవీ మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది.

ఫెరారీ సీఈవో బెనెడెట్టో విగ్నా మాట్లాడుతూ.. 'లూస్' కారును అభివృద్ధి చేయడానికి దాదాపు ఐదేళ్ల సమయం పట్టిందని తెలిపారు. ఈ కారులోని అన్ని కీలక సాంకేతిక భాగాలను సంస్థ స్వయంగా తయారు చేసిందని వెల్లడించారు.

ఫెరారీ నిపుణుల వివరాల ప్రకారం.. 'లూస్' కారులో ప్రతి వీల్‌కు ప్రత్యేక ఎలక్ట్రిక్ మోటార్ అమర్చారు. ఈ కారు కేవలం 2.5 సెకన్లలోనే గంటకు 96 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదని తెలిపారు. అత్యాధునిక సాంకేతికత, విలాసవంతమైన డిజైన్, అధిక పనితీరు కలయికతో రూపొందిన ఈ మోడల్ లగ్జరీ ఈవీ విభాగంలో కొత్త ప్రమాణాలు సృష్టించే అవకాశముందని ఆటో రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అమెజాన్ 'మెగా క్రికెట్ ఫెస్టివల్'..

క్రికెట్ అభిమానులు, స్పోర్ట్స్ లవర్స్ కోసం అమెజాన్ ఇండియా ప్రత్యేక 'మెగా క్రికెట్ ఫెస్టివల్'ను ప్రారంభించింది. మే 31, 2026 వరకు కొనసాగనున్న ఈ ప్రత్యేక సేల్‌లో క్రీడా పరికరాలు, అభిమానుల కోసం ప్రత్యేక మర్చండైజ్, ఫిట్‌నెస్ ఉత్పత్తులు, కలెక్టిబుల్స్, స్మార్ట్ టీవీలపై 70 శాతం వరకు భారీ తగ్గింపులు అందుబాటులో ఉంచింది.

ఈ ఫెస్టివల్‌లో ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులు ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్నాయి. ముఖ్యంగా ఎస్‌జీ, డీఎస్‌సీ, కోకాటూ, బోల్డ్ ఫిట్, నివియా, ప్లేయర్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కనిపిస్తోంది.

ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై అదనపు రాయితీలు కూడా అందిస్తున్నారు. అలాగే




ఐసీఐసీఐ బ్యాంక్తో భాగస్వామ్యంలో ఉన్న అమెజాన్ పే క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు 5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రైమ్ సభ్యులకు కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై అదే రోజు డెలివరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది.

ఈసారి కొనుగోలు అనుభవాన్ని మరింత సులభతరం చేసేందుకు అమెజాన్ కృత్రిమ మేధ ఆధారిత సరికొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'రూఫస్' అనే ఏఐ అసిస్టెంట్ ద్వారా హింగ్లిష్‌తో పాటు భారతీయ భాషల్లో కూడా వినియోగదారులు తమ అవసరాలకు తగ్గ ఉత్పత్తులను సులభంగా వెతుక్కోవచ్చు. వయస్సు, వినియోగం ఆధారంగా సరైన క్రికెట్ బ్యాట్, జిమ్ గ్లోవ్స్ వంటి వస్తువులను సూచించే విధంగా ఈ ఫీచర్ పనిచేస్తోంది.

అలాగే 'లెన్స్ ఏఐ' సదుపాయం ద్వారా కేవలం ఫొటో ఆధారంగా ఉత్పత్తులను గుర్తించి కొనుగోలు చేసే అవకాశం ఉంది. 'రివ్యూ హైలైట్స్' ద్వారా వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకోవచ్చు. 'ప్రైస్ హిస్టరీ' ఫీచర్‌తో ధరల మార్పులను కూడా గమనించవచ్చు.

ఈ సేల్‌లో కొన్ని ప్రత్యేక ఆఫర్లు కూడా ఆకట్టుకుంటున్నాయి. కోకాటూ ఫుల్ క్రికెట్ సెట్ రూ.899కు, జస్పో ప్లాస్టిక్ బ్యాట్ రూ.329కు లభిస్తోంది. అలాగే విరాట్ కోహ్లీ బాబుల్ హెడ్ కలెక్టిబుల్ రూ.749కు అందుబాటులో ఉంది. మ్యాచ్‌లను థియేటర్ అనుభూతితో వీక్షించాలనుకునేవారి కోసం షియోమి 55 అంగుళాల 4కే టీవీ రూ.51,999కు విక్రయిస్తున్నారు.

క్రికెట్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని తీసుకొచ్చిన ఈ ప్రత్యేక సేల్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు ఈకామర్స్ వర్గాలు చెబుతున్నాయి.

## ఫాస్టాగ్ పని చేయట్లేదా?..

# ఇలా చేస్తే సమస్యకు చెక్

టోల్ గేట్ల వద్ద రద్దీ తగ్గించి, వాహనదారుల ప్రయాణాన్ని సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఫాస్టాగ్ను తప్పనిసరి చేసింది. టోల్ ప్లాజాల వద్ద నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహిస్తూ ప్రస్తుతం ఫాస్టాగ్ లేదా యూపీఐ ద్వారానే టోల్ ఫీజు చెల్లించే విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఫాస్టాగ్ పనిచేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫాస్టాగ్ పనిచేయకపోవడానికి ప్రధాన కారణాల్లో వాహనం విండ్ షీల్డ్ పరిశుభ్రంగా లేకపోవడం ఒకటి. గాజుపై దుమ్ము, మురికి పేరుకుపోతే స్కానర్లు ఆర్ఎఫ్ఐడీ చిప్‌ను సరిగా చదవలేవు. ఫాస్టాగ్ తరచూ స్కాన్ కాకపోతే వెంటనే దానిని మార్చుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం ఫాస్టాగ్ జారీ చేసిన బ్యాంక్ లేదా సంబంధిత సంస్థను సంప్రదించి కొత్త ఫాస్టాగ్ తీసుకోవాలి. కొత్త ఫాస్టాగ్ అమర్చిన తర్వాత టోల్ గేట్ల వద్ద స్కానింగ్ సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ఫాస్టాగ్ ఉన్న ప్రాంతాన్ని గట్టిగా రుద్దకూడదు. ఫాస్టాగ్‌ను తీసి మళ్లీ అతికించడం, వంచడం వంటి పనులు చేయరాదు. దానిపై ఇతర స్టిక్కర్లు లేదా సన్ ఫిల్మ్‌లు అంటించడం కూడా స్కానింగ్ సమస్యలకు కారణమవుతుంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే టోల్ గేట్ల వద్ద ఇబ్బందులు లేకుండా ప్రయాణం కొనసాగించవచ్చు.

# ఆధునిక భారత శిల్పి నెహ్రూ

- స్వాతంత్ర్య పోరాట యోధుడు
- అభివృద్ధి దిశగా దేశాన్ని నడిపించిన నేత
- ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేసిన మహానేత



భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిన జవహర్‌లాల్ నెహ్రూ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, స్వతంత్ర భారత తొలి ప్రధానిగా దేశాన్ని ముందుకు నడిపించిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసిన మహానేతగా నెహ్రూ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. జవహర్‌లాల్ నెహ్రూ 1889 నవంబర్ 14న అలహాబాద్‌లో జన్మించారు. ఆయన తండ్రి మోతీలాల్ నెహ్రూ ప్రముఖ న్యాయవాది. చిన్ననాటి నుంచే నెహ్రూకు చదువుపై ఆసక్తి ఎక్కువగా ఉండేది. కుటుంబం సంపన్నమైనదైనా ప్రజల సమస్యలపై ఆయనకు చిన్నప్పటి నుంచే అవగాహన ఉండేది. ఇంటివద్ద ప్రాథమిక విద్య పూర్తి చేసిన తరువాత ఉన్నత చదువుల కోసం ఇంగ్లాండ్‌కు వెళ్లారు. ఇంగ్లాండ్‌లోని హారో పాఠశాల, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన నెహ్రూ తరువాత న్యాయశాస్త్రం అభ్యసించారు. విదేశాల్లో ఉన్న సమయంలో ప్రపంచ రాజకీయాలు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై ఆయనకు లోతైన అవగాహన పెరిగింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత కొంతకాలం న్యాయవాదిగా పనిచేసినా, దేశ ప్రజల పరిస్థితులు చూసి స్వాతంత్ర్య ఉద్యమంలో చేరాలని నిర్ణయించుకున్నారు.

మహాత్మా గాంధీ ఆలోచనల ప్రభావంతో నెహ్రూ జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అసహకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, భారత్ విడిచి పో ఉద్యమం వంటి అనేక పోరాటాల్లో ఆయన ముందుండి పనిచేశారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను పలుమార్లు జైలుకు పంపింది. జైలు జీవితం గడిపినప్పటికీ ఆయన ధైర్యం కోల్పోలేదు. స్వాతంత్ర్యం కోసం చివరి వరకు పోరాడారు. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ తొలి ప్రధానిగా నెహ్రూ బాధ్యతలు చేపట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే దేశం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో ఆయన సమర్థ నాయకత్వం చూపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం, రాజ్యాంగ విలువలను కాపాడడం, దేశ ఐక్యతను నిలబెట్టడం కోసం కృషి చేశారు.

నెహ్రూ పాలనలో దేశంలో పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు వేగంగా అభివృద్ధి చెందాయి. భారీ ఆనకట్టలు, ఉక్కు కర్మాగారాలు, శాస్త్ర సాంకేతిక సంస్థలు దేశ అభివృద్ధికి బలమైన పునాది అయ్యాయి. భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు స్థాపనకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. శాస్త్రీయ దృక్పథం ఉన్న దేశంగా భారత్ ఎదగాలని ఆయన కోరుకున్నారు. విదేశాంగ విధానంలో కూడా నెహ్రూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇతర దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడానికి కృషి చేశారు. శాంతి, సహజీవనం, పరస్పర గౌరవం అనే సిద్ధాంతాలను ఆయన ప్రోత్సహించారు. ప్రపంచ దేశాల మధ్య భారతదేశానికి గౌరవప్రదమైన స్థానం తీసుకురావడంలో నెహ్రూ పాత్ర ఎంతో ముఖ్యమైంది. పిల్లలంటే నెహ్రూకు ఎంతో ప్రేమ ఉండేది. పిల్లల భవిష్యత్తే దేశ భవిష్యత్తని ఆయన నమ్మేవారు. అందుకే పిల్లలు ఆయనను ప్రేమగా "చాచా నెహ్రూ" అని పిలిచేవారు. ఆయన జన్మదినమైన నవంబర్ 14ను దేశవ్యాప్తంగా బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. విద్య, క్రమశిక్షణ, విజ్ఞానం ద్వారా యువత ముందుకు రావాలని ఆయన ఎప్పుడూ కోరుకునేవారు. 1964 మే 27న జవహర్‌లాల్ నెహ్రూ కన్నుమూశారు. ఆయన మరణంతో దేశం గొప్ప నాయకుడిని కోల్పోయింది. అయినప్పటికీ ఆయన ఆలోచనలు, అభివృద్ధి దృక్పథం, ప్రజాస్వామ్య విలువలు ఇప్పటికీ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆధునిక భారత నిర్మాణ శిల్పిగా నెహ్రూ పేరు భారత చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# తగ్గుతున్న పక్షుల సంఖ్య

- ప్రకృతిలో మారుతున్న సమతుల్యం
- నగరీకరణతో కనుమరుగవుతున్న పక్షులు
- వాతావరణ మార్పుల తీవ్ర ప్రభావం
- ప్రకృతి భవిష్యత్తుకు హెచ్చరిక సంకేతాలు



ఒకప్పుడు ఉదయం వేళల్లో పక్షుల కిలకిలరావాలతో కళకళలాడిన గ్రామాలు, పట్టణాలు ఇప్పుడు నిశ్శబ్దంగా మారుతున్నాయి. ఇంటి ముంగిట కనిపించే గువ్వలు, పొలాల్లో తిరిగే కొంగలు, చెట్లపై గూళ్లు కట్టే పక్షుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుండటం పర్యావరణ నిపుణులను ఆందోళనకు గురిచేస్తోంది. వేగంగా పెరుగుతున్న నగరీకరణ, చెట్ల నరికివేత, చెరువుల మాయం, రసాయనాల అధిక వినియోగం కారణంగా పక్షుల సహజ నివాసాలు నాశనమవుతున్నాయి. భారీ భవనాలు, రహదారులు, పరిశ్రమలు పెరుగుతుండటంతో పక్షులకు ఆహారం, నీరు, గూళ్లు కట్టేందుకు అవసరమైన ప్రదేశాలు దొరకడం కష్టమవుతోంది. ఒకప్పుడు ప్రతి ఇంటి వద్ద కనిపించే గువ్వలు ఇప్పుడు అరుదుగా మాత్రమే కనిపించడం పరిస్థితి ఎంత తీవ్రమైందో తెలియజేస్తోంది. వాతావరణ మార్పులు కూడా పక్షుల జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అసాధారణ వర్షాలు, ఎండ తీవ్రత కారణంగా అనేక జాతుల పక్షులు తమ నివాస ప్రాంతాలను మార్చుకోవాల్సి వస్తోంది. కొన్ని పక్షులు వలస మార్గాలను మార్చుకుంటుండగా, మరికొన్ని జాతులు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదంలో పడుతున్నాయి. వేసవిలో నీటి కొరత వల్ల వేలాది పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయి. వ్యవసాయంలో అధికంగా వాడుతున్న పురుగుమందులు కూడా పక్షుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. పురుగులను ఆహారంగా తీసుకునే పక్షులు విషపూరిత ప్రభావానికి గురై మరణిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

పక్షులు ప్రకృతి అందాన్ని పెంచడమే కాదు, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. కొన్ని పక్షులు పంటలకు హాని చేసే పురుగులను తింటాయి. మరికొన్ని విత్తనాలను వ్యాప్తి చేసి అడవుల పెరుగుదలకు సహాయపడతాయి. పూల పరాగసంపర్కంలో కూడా పక్షుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. పక్షుల సంఖ్య తగ్గిపోతే వ్యవసాయం, అడవులు, జీవ వైవిధ్యం అన్నింటిపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా రాబందుల సంఖ్య తగ్గిన తరువాత చనిపోయిన జంతువుల శరీరాలు ఎక్కువసేపు అలాగే ఉండటం వల్ల పర్యావరణ సమస్యలు పెరిగినట్టు పరిశోధనలు వెల్లడించాయి.

నగరాల్లో పెరుగుతున్న శబ్ద కాలుష్యం, కాంతి కాలుష్యం కూడా పక్షుల జీవనశైలిని దెబ్బతీస్తున్నాయి. రాత్రివేళల్లో అధిక వెలుతురు, భారీ శబ్దాలు కారణంగా పక్షుల సహజ ప్రవర్తన మారిపోతోంది. గూళ్లు కట్టడంలో, ఆహారం వెతకడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొబైల్ టవర్ల ప్రభావంపై కూడా చాలాకాలంగా చర్చ కొనసాగుతోంది. పర్యావరణానికి హాని చేసే ప్రతి చిన్న మార్పు చివరకు పక్షుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో అనేక అరుదైన పక్షి జాతులు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. పక్షులను కాపాడటం ఇప్పుడు ప్రతి ఒక్కరి బాధ్యతగా మారింది. ఇంటి చుట్టూ చెట్లు నాటడం, వేసవిలో నీటి పాత్రలు ఉంచడం, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం వంటి చిన్న చర్యలు కూడా మంచి ఫలితాలు ఇస్తాయని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో ప్రకృతి ప్రేమ పెంపొందించాల్సిన అవసరం ఉంది. చెట్లు, చెరువులు, సహజ వాతావరణాన్ని కాపాడితేనే భవిష్యత్ తరాలు కూడా పక్షుల కిలకిలరావాలను ఆస్వాదించగలుగుతాయి. పక్షుల సంఖ్య తగ్గిపోవడం కేవలం ఒక జీవ వైవిధ్య సమస్య మాత్రమే కాదు, ప్రకృతి సమతుల్యం దెబ్బతింటోందనే ప్రమాద హెచ్చరికగా కూడా భావించాల్సిన అవసరం ఉంది.

# ప్రాణాల కోసం పరిగెత్తే సేవలు


- అత్యవసర వైద్య వ్యవస్థ బలోపేతం అవసరం
- సమయానికి స్పందిస్తే ఎన్నో ప్రాణాలు రక్షణ
- సేవల వెనుక వైద్య సిబ్బంది త్యాగాలు
- అత్యవసర వైద్య సేవల దినం



రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు, గుండెపోటు వచ్చినప్పుడు, సహజ విపత్తు సంభవించినప్పుడు ప్రజలకు మొదట గుర్తుకు వచ్చేది అత్యవసర వైద్య సేవలే. ఆపదలో ఉన్న వ్యక్తిని కాపాడేందుకు అంబులెన్స్ సైరన్ వినిపించే ప్రతి క్షణం ఒక ప్రాణంతో పోరాటమే. సమయం కీలకమైన సందర్భాల్లో వైద్య సిబ్బంది తీసుకునే వేగవంతమైన నిర్ణయాలు ఎన్నో కుటుంబాల్లో మళ్లీ ఆశలు నింపుతున్నాయి. అందుకే అత్యవసర వైద్య సేవలు కేవలం ఒక విభాగం కాదు, సమాజానికి ప్రాణాధారం అనే చెప్పాలి. ప్రతి మనిషి జీవితంలో ప్రమాదం ఎప్పుడు వస్తుందో ఎవరూ చెప్పలేరు. రోడ్డు ప్రమాదాలు, గుండెపోటులు, అకస్మాత్తుగా సంభవించే ఆరోగ్య సమస్యలు, సహజ విపత్తులు వంటి సందర్భాల్లో ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చేది అత్యవసర వైద్య సేవల వ్యవస్థే. అందుకే ప్రతి ఏడాది "అత్యవసర వైద్య సేవల దినం"ను నిర్వహిస్తూ ఈ రంగంలో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, అంబులెన్స్ సిబ్బంది సేవలను గుర్తు చేసుకుంటున్నారు. సమయానికి స్పందిస్తే ఒక ప్రాణాన్ని మాత్రమే కాదు, ఒక కుటుంబాన్ని కూడా కాపాడవచ్చనే విషయాన్ని ఈ దినం గుర్తుచేస్తోంది. ప్రస్తుతం దేశంలో రోడ్డు ప్రమాదాలు, గుండె సంబంధిత సమస్యలు, వేడి తీవ్రత కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో బలమైన అత్యవసర వైద్య వ్యవస్థ అవసరం మరింత స్పష్టమవుతోంది. ప్రమాదం జరిగిన తరువాత మొదటి కొన్ని నిమిషాలను వైద్యులు "సువర్ణ సమయం"గా పరిగణిస్తారు. ఈ సమయంలో సరైన చికిత్స అందితే ప్రాణాలను రక్షించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కానీ అనేక ప్రాంతాల్లో అంబులెన్స్ ఆలస్యంగా చేరడం, సరైన పరికరాల కొరత, వైద్య సిబ్బంది తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఇంకా కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. దూర ప్రాంతాల్లో ఆసుపత్రులు లేకపోవడం, రవాణా సౌకర్యాలు సరిగా అందుబాటులో లేకపోవడం వల్ల అత్యవసర సమయంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, ప్రమాద బాధితులు సమయానికి చికిత్స అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తరచుగా వెలుగులోకి వస్తున్నాయి. కేవలం పెద్ద నగరాల్లోనే కాదు, ప్రతి మండలం స్థాయిలో అత్యవసర వైద్య సేవలు బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. అత్యవసర వైద్య సిబ్బంది సేవలను సమాజం తగిన స్థాయిలో గుర్తించాల్సిన అవసరం కూడా ఉంది. రాత్రింబవళ్లు, పండుగలు, విపత్తులు అన్న తేడా లేకుండా వారు ప్రజల ప్రాణాల కోసం పనిచేస్తుంటారు. అంబులెన్స్ డ్రైవర్లు ట్రాఫిక్ మధ్య వేగంగా ప్రయాణించి రోగిని ఆసుపత్రికి చేర్చేందుకు ప్రయత్నిస్తారు. నర్సులు, వైద్యులు ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో కూడా చికిత్స అందిస్తారు. అనేక సందర్భాల్లో వారి కుటుంబాలకు సమయం ఇవ్వకుండా విధుల్లో ఉండాల్సి వస్తుంది. ప్రజల్లో కూడా అత్యవసర పరిస్థితులపై అవగాహన పెరగాలి. అంబులెన్స్‌కు దారి ఇవ్వడం, ప్రమాద సమయంలో భయపడకుండా సహాయం చేయడం, ప్రాథమిక చికిత్సపై కనీస అవగాహన కలిగి ఉండడం వంటి అంశాలు ఎంతో కీలకం. కొన్నిసార్లు చిన్న నిర్లక్ష్యమే ప్రాణనష్టానికి కారణమవుతుంది. సమాజం, ప్రభుత్వం, వైద్య రంగం కలిసి పనిచేస్తే అత్యవసర సేవలను మరింత సమర్థవంతంగా మార్చుకోవచ్చు. అత్యవసర వైద్య సేవలు బలంగా ఉన్న దేశమే నిజమైన అభివృద్ధి సాధించిన దేశంగా నిలుస్తుంది. సాంకేతికత పెరుగుతున్న ఈ కాలంలో ఆధునిక అంబులెన్స్ వ్యవస్థలు, వేగవంతమైన సమాచార సదుపాయాలు, శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ప్రతి ప్రాంతంలో అందుబాటులో ఉండాలి. ఒక ప్రాణాన్ని కాపాడటం అంటే ఒక కుటుంబాన్ని నిలబెట్టినట్టే. అందుకే అత్యవసర వైద్య సేవలను మరింత బలోపేతం చేయడం సమాజం ముందున్న ముఖ్యమైన బాధ్యతగా మారింది. ప్రజల్లో ప్రాథమిక చికిత్సపై అవగాహన పెరగడం కూడా ఎంతో ముఖ్యం. ప్రమాదం జరిగినప్పుడు ఎలా స్పందించాలి, గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఎలా సహాయం చేయాలి, అంబులెన్స్‌కు ఎలా సమాచారం ఇవ్వాలి వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. చాలా సందర్భాల్లో ప్రజల అప్రమత్తత వల్ల కూడా ప్రాణాలు కాపాడబడుతున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో ప్రాథమిక చికిత్సపై శిక్షణ ఇవ్వడం సమయోచిత చర్యగా మారుతుంది. అత్యవసర వైద్య సేవల దినం కేవలం ఒక ప్రత్యేక దినం మాత్రమే కాదు, ప్రాణాల విలువను గుర్తు చేసే సందర్భం కూడా. ఒక ప్రాణాన్ని కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న వైద్య సిబ్బంది సేవలు సమాజానికి ఎంతో గొప్పవి. ప్రభుత్వం అత్యవసర వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ఆధునిక పరికరాలు అందుబాటులోకి తీసుకురావడం, గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరించడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సమయానికి స్పందించే అత్యవసర వైద్య వ్యవస్థ ఉన్నప్పుడే ప్రజల ప్రాణ భద్రత మరింత బలపడుతుంది.

# ఎండ నుంచి చర్మానికి రక్షణ

**సన్‌స్క్రీన్ వినియోగంపై పెరుగుతున్న అవగాహన**
**అల్ట్రావయలెట్ కిరణాలతో చర్మ సమస్యలు**
**వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి**



ఎండాకాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్ర అల్ట్రావయలెట్ కిరణాల ప్రభావం నుంచి చర్మాన్ని రక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ ప్రతి ఏడాది సన్‌స్క్రీన్ రక్షణ అవగాహన దినాన్ని నిర్వహిస్తున్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న వేడి కారణంగా చర్మ సంబంధిత సమస్యలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రజల్లో చర్మ సంరక్షణపై అవగాహన పెంచడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యం. ముఖ్యంగా వేసవిలో బయట ఎక్కువసేపు ఉండే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సూర్యుడి నుంచి వచ్చే అల్ట్రావయలెట్ కిరణాలు చర్మంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. అధికంగా ఎండలో తిరగడం వల్ల చర్మం నల్లబడడం, పొడిబారడం, మంట, దురద వంటి సమస్యలు కనిపిస్తాయి. కొంతమందిలో చర్మ అలర్జీలు, మచ్చలు, ముడతలు కూడా వేగంగా పెరుగుతాయి. దీర్ఘకాలం నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన చర్మ వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చర్మ రక్షణలో సన్‌స్క్రీన్ కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. బయటకు వెళ్లే ముందు సరైన ఎస్‌పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ ఉపయోగిస్తే అల్ట్రావయలెట్ కిరణాల ప్రభావం కొంతవరకు తగ్గుతుందని వివరిస్తున్నారు. ముఖం మాత్రమే కాకుండా చేతులు, మెడ వంటి బయట కనిపించే భాగాలకు కూడా సన్‌స్క్రీన్ రాసుకోవాలని సూచిస్తున్నారు. ఎండలో ఎక్కువసేపు ఉంటే కొంతకాలం తర్వాత మళ్లీ సన్‌స్క్రీన్ ఉపయోగించడం మంచిదని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, బయట పనిచేసే కార్మికులు వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండడం, టోపీలు, కళ్లద్దాలు ఉపయోగించడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం ద్వారా కూడా చర్మాన్ని రక్షించుకోవచ్చని చెబుతున్నారు. తగినంత నీరు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉండి చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొంటున్నారు.

ఇటీవల కాలంలో యువతలో చర్మ సంరక్షణపై అవగాహన పెరుగుతున్నప్పటికీ చాలామంది సరైన విధంగా సన్‌స్క్రీన్ వినియోగించడం లేదని నిపుణులు చెబుతున్నారు. చర్మ తత్వానికి సరిపడే ఉత్పత్తులు ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని సూచిస్తున్నారు. మార్కెట్లో అందుబాటులో ఉన్న ప్రతి ఉత్పత్తి అందరికీ సరిపోదని, అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు. వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో చర్మ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా మారింది. కేవలం అందం కోసం కాకుండా ఆరోగ్య రక్షణ కోసం కూడా సన్‌స్క్రీన్ వినియోగం అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఎండ ప్రభావం నుంచి చర్మాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కార్యక్రమాల్లో నిపుణులు వివరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# థియేటర్ పర్సంటేజ్ వివాదంపై రంగంలోకి చిరంజీవి

తెలుగు సినీ పరిశ్రమలో థియేటర్ పర్సంటేజ్ విధానం చుట్టూ నెలకొన్న వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి స్వయంగా రంగంలోకి దిగడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం ‘పెద్ది’ విడుదలకు ముందు నుంచే కొత్త పర్సంటేజ్ విధానాన్ని అమలు చేయాలన్న డిమాండ్ బలపడుతున్న వేళ, తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లో చిరంజీవిని కలిసి కీలక చర్చలు జరిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా థియేటర్లలో అమలవుతున్న రెంటల్ విధానం, పర్సంటేజ్ షేరింగ్ వ్యవస్థ, సింగిల్ స్క్రీన్ థియేటర్ల ఆర్థిక ఇబ్బందులు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భారీ సినిమాలు విడుదలైనప్పటికీ థియేటర్లకు ఆశించిన లాభాలు రావడం లేదని, ముఖ్యంగా చిన్న పట్టణాల్లోని సింగిల్ స్క్రీన్ యజమానులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని ఎగ్జిబిటర్లు చిరంజీవి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇకపై రెంటల్ విధానానికి బదులుగా పర్సంటేజ్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తేనే థియేటర్లు నిలబడగలవని వారు అభిప్రాయపడ్డారు. ఈ భేటీలో ఫిలిం చాంబర్ అధ్యక్షుడు సురేష్ బాబు, ప్రముఖ నిర్మాత కేఎల్ నారాయణ, నిర్మాత దిల్ రాజు తదితరులు కూడా తమ అభిప్రాయాలను చిరంజీవికి వివరించినట్లు తెలుస్తోంది. దాదాపు గంటకు పైగా సాగిన ఈ కీలక సమావేశం అనంతరం చిరంజీవి సినీ నిర్మాతల గిల్డ్ సభ్యులతో కూడా ప్రత్యేకంగా మాట్లాడారు. సమావేశం తర్వాత నిర్మాత దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ.. “చిరంజీవి గారు పరిశ్రమ సమస్యను చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఎగ్జిబిటర్ల ఆవేదనను పూర్తిగా అర్థం చేసుకున్నారు. రెండ్రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు” అని తెలిపారు. ఇప్పటికే ఫిలిం చాంబర్ ఈ అంశంపై ఒక ప్రత్యేక కమిటీని నియమించిందని, ఆ కమిటీ సమర్పించిన నివేదికను చిరంజీవి పరిశీలించనున్నట్లు దిల్ రాజు వెల్లడించారు. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లందరికీ న్యాయం జరిగేలా ఒక సమతుల్య నిర్ణయం తీసుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన




# ‘ప్రియసఖి’తో మళ్లీ మ్యాజిక్ చేస్తున్న ఆనంద్-వైష్ణవి జోడీ

యువ నటుడు ఆనంద్ దేవరకొండ, నటి వైష్ణవి చైతన్య జంటగా తెరకెక్కుతున్న తాజా ప్రేమకథా చిత్రం ‘ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్’పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. సూపర్ హిట్ ‘90స్’ వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే టైటిల్‌తోనే యువతలో ప్రత్యేక ఆకర్షణను సొంతం చేసుకుంది. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన తొలి గీతం ‘ప్రియసఖి’ ఇప్పుడు సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత సంస్థ ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలైన ఈ లిరికల్ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ పాట పూర్తి స్థాయి మెలోడియస్ ఫీల్‌తో సాగుతూ యువత మనసులను తాకుతోంది. ప్రేమలో పడిన ఓ యువకుడి భావోద్వేగాలను, అతని జీవితంలోకి వచ్చిన అమ్మాయి కారణంగా చోటుచేసుకునే అందమైన మార్పులను ఈ గీతంలో ఎంతో హృద్యంగా చూపించారు. “సూర్యుడు ఎరుగని కొత్త కాంతి ఇది.. చంద్రుడు చూడని కొత్త వెన్నెలి ది.. భూమికి తెలియని మట్టి వాసనిది ఏమిది ఏమిది” వంటి పల్లవులు శ్రోతలను ఆకట్టుకుంటుండగా, “జీవితాన్ని మార్చేసావే బుజ్జి నెమలి.. స్వర్గంలోతూ చూపించవే పూలకడలి” వంటి లైన్లు ప్రేమలోని మాధుర్యాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తున్నాయి.

పాటలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మధ్య కనిపించిన కెమిస్ట్రీ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. గతంలో ‘బేబీ’ చిత్రంతో ఈ జంట ప్రేక్షకులను ఎంతగానో మెప్పించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ కలిసి నటిస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి రెట్టింపైంది. ‘ప్రియసఖి’ పాటలో కనిపించిన భావోద్వేగాలు, విజువల్స్, యువతకు దగ్గరగా ఉండే ప్రేమ సంభాషణలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# అమ్మ జ్ఞాపకాలతో భావోద్వేగానికి గురైన శ్రీ గౌరి ప్రియ

తెలుగు సినీ పరిశ్రమలో విభిన్న పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ మరోసారి వార్తల్లో నిలిచింది. సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి ‘చెన్నై లవ్ స్టోరీ’ చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన ‘వదలనే’ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు అందరినీ కదిలించాయి. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించిన ‘వదలనే’ పాట విడుదల కార్యక్రమంలో చిత్ర బృందం మొత్తం పాల్గొంది. ఈ సందర్భంగా వ్యాఖ్యాత స్రవంతి చొక్కారపు వేదికపై ఉన్న నటీనటులను ఉద్దేశించి “ఈ పాటలోని సాహిత్యాన్ని ఎవరికి అంకితం చేస్తారు?” అని ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే క్రమంలో శ్రీ గౌరి ప్రియ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. “నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు.. నాకు తెలుసు. ఈ పాటలోని ప్రతి లైన్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను” అంటూ ఆమె కన్నీటి గొంతుతో చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు మౌనంగా మారిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతోంది. అభిమానులు, సినీ ప్రేక్షకులు శ్రీ గౌరి ప్రియ ధైర్యాన్ని ప్రశంసిస్తూ స్పందిస్తున్నారు. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా కన్నుమూశారు. తల్లితో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉండేదని ఆమె ఇప్పటికే పలు ఇంటర్వ్యూల్లో వెల్లడించింది. కేవలం తల్లిగానే కాకుండా మంచి స్నేహితురాలిలా తనతో ఉండేదని, ప్రతి విషయాన్ని పంచుకునేదని చెప్పింది. తల్లి మరణం తర్వాత కొంతకాలం తీవ్ర మానసిక వేదన అనుభవించిన శ్రీ గౌరి ప్రియ.. ఆ బాధను అధిగమించి మళ్లీ తన నటనా ప్రయాణంపై దృష్టి పెట్టింది. ఇప్పటికే ‘మెయిల్’, ‘మోడర్న్ లవ్ చెన్నై’, ‘మ్యాడ్’, ‘రైటర్ పద్మభూషణ్’, ‘లవర్’, ‘హ్యాపీ రాజ్’ వంటి చిత్రాల ద్వారా ప్రేక్షకులకు చేరువైన శ్రీ గౌరి ప్రియ.. ఇప్పుడు వరుస అవకాశాలతో బిజీగా మారింది. ప్రస్తుతం ‘చెన్నై లవ్ స్టోరీ’తో పాటు ‘వీసా – వింటారా సరదాగా’, ‘బ్రో కోడ్’ వంటి చిత్రాల్లో నటిస్తోంది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ‘చెన్నై లవ్ స్టోరీ’ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై యువ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.





# అనన్య నాట్యంపై ట్రోల్స్

బాలీవుడ్ నటి అనన్య పాండే మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన ‘లైగర్’ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోవడంతో విమర్శలు ఎదుర్కొన్న ఆమె.. ఇప్పుడు కొత్త ప్రేమకథా చిత్రం ‘చాంద్ మేరా దిల్’తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ తన ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రంలో ‘కిల్’ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న లక్ష్య లాల్వాని కథానాయకుడిగా నటించాడు. హైదరాబాద్ నగరాన్ని నేపథ్యంగా తీసుకుని కాలేజీ ప్రేమకథగా రూపొందిన ఈ సినిమా యువతను ఆకట్టుకునేలా రూపొందించామని చిత్రబృందం చెబుతోంది.

అయితే ప్రస్తుతం సినిమా కంటే అందులోని ఒక నృత్య సన్నివేశమే ఎక్కువ చర్చకు దారితీస్తోంది. చిత్రంలో అనన్య పాండే చేసిన భరతనాట్య ప్రదర్శనపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె నృత్య కదలికలు, హావభావాలు సంప్రదాయ భరతనాట్య శైలికి విరుద్ధంగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. “భరతనాట్యాన్ని వినోదంగా మార్చేశారా?” అంటూ కొందరు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తుండగా.. మరికొందరు మాత్రం దర్శకుడి ఆలోచన ప్రకారమే ఆ సన్నివేశాన్ని చిత్రీకరించారని సమర్థిస్తున్నారు.

ఈ వివాదంతో నటి అనన్య పాండేతో పాటు దర్శకుడు వివేక్ సోనీ కూడా విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఆ నృత్య దృశ్యానికి సంబంధించిన చిన్న వీడియో క్లిప్ సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతూ అనేక వ్యంగ్య చిత్రాలు, మీమ్స్‌కు కారణమవుతోంది. ముఖ్యంగా సంప్రదాయ నృత్య కళల అభిమానులు ఈ సన్నివేశంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇక వసూళ్ల పరంగా చూస్తే.. ‘చాంద్ మేరా దిల్’ చిత్రానికి మిశ్రమ స్పందన లభిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. తొలి వారాంతంలో సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేదని సమాచారం. మొదటి మూడు రోజుల్లోనే రూ.15 కోట్ల మార్క్‌ను దాటలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ భారీ చర్చ సినిమాకు అదనపు ప్రచారంగా మారుతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతికూల స్పందన వచ్చినా, వైరల్ హడావుడి కారణంగా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు ఈ వివాదం సినిమా భవిష్యత్ వసూళ్లపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in